బడి గంట మోగింది


వేసవి సెలవులు ముగిశాయి. బడి గంట మోగింది. జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని యాజమాన్యాల పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కాగా పలు స్కూళ్లకు తొలిరోజు స్వల్ప సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్ని బడుల్లో చేర్పించారు. నెల్లూరు బీవీ నగర్‌లోని కేఎన్నార్ పురపాలక హైస్కూల్లో విద్యార్థులు పుస్తకాలు, కుర్చీలు మోస్తూ కనిపించారు. అలాగే ప్రవేశపరీక్ష నిమిత్తం పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు మంచినీరు ఇచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నెల్లూరులో కేఎన్నార్ స్కూల్ వద్ద ఇలా..





పిల్లాడిని స్కూలుకు తీసుకెళ్తూ..



కేఎన్నార్ స్కూల్లో తాగునీరు ఇస్తున్న విద్యార్థినులు



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న పొదలకూరు రోడ్డు జెడ్పీ స్కూల్ విద్యార్థినులు



కేఎన్నార్ స్కూల్లో కుర్చీలు తీసుకెళ్తూ..



పుస్తకాలు మోస్తూ..

క్లుప్తంగా

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

- 15 నుంచి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఎప్పుడిస్తారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు, ప్రస్తుతం ఆ ఊసే తీయడం లేదన్నారు. ఇంటింటికీ వచ్చి ఇస్తున్న రేషన్ వాహనాలను తీసేసి ప్రజలను ఇక్కట్ల పాలు చేశారని, 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డు పాలుచేశారన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సర్దార్, యాసిన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర బైబిల్ విశ్లేషణ'పై సదస్సు రేపు

నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్టు చర్చి డౌనీహాల్లో 'సమగ్ర బైబిల్ విశ్లేషణ' సదస్సు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కవనెంట్ స్కూల్ ఆఫ్ క్రిస్టియన్ ఎడ్యుకేషన్ కన్వీనర్ పి.శామ్యూల్ సుకుమార్ గురువారం తెలిపారు. ఈ సదస్సులో బైబిల్‌లోని అనేక అంశాలను పాస్టర్ జోసెఫ్ టి.రవికాంత్ విశ్లేషణాత్మక వివరణతో కూడిన ప్రసంగాలను అందిస్తారని తెలిపారు. బైబిల్‌లోని అనేక అంశాలపై ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవచ్చన్నారు. ఇతర వివరాల కోసం 90007 05599, 93467 77400 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎంసీలో ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఎన్‌ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. మెటర్నిటీ, ఫెర్టిలిటీ, లాప్రోస్కోపిక్ సెంటర్, శ్రీసాయి చేతన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కాన్పులు, గర్భకోశ వ్యాధి నిపుణురాలు ఝాన్సీరెడ్డి పాల్గొని, కార్పొరేషన్ సిబ్బందికి వివిధ అనారోగ్య సమస్యలను పరీక్షించారు.


సోలార్‌తో 20 ఏళ్లపాటు ఉచిత విద్యుత్



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోలార్‌తో 20 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ పొందవచ్చని పీఎం సూర్యఘర్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ అన్నారు. నగరంలోని హరనాథపురం విద్యుత్ సెక్షన్‌లో సోలార్ విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాల గ్యారెంటీతో ఐదేళ్లలోనే పెట్టుబడి తిరిగి వస్తుందని, మరో 20 ఏళ్లు ఉచితంగా విద్యుత్ పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో డీఈఈ సునీల్, అసిస్టెంట్ ఇంజినీర్ గోపాలకృష్ణ, సురేష్, విజయ్, మునిశేఖర్, జూనియర్ ఇంజినీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు తల్లి పద్మావతి ఉత్తరక్రియల్లో రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. పడారుపల్లిలోని శ్రీనివాసరావు నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

మలేరియాపై అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు

నెల్లూరు(అర్బన్): మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మలేరియా ప్రబలకుండా ప్రజలు అవగాహన పెంపొందించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు తెలిపారు. మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆకుతోట ఆరోగ్య కేంద్రం పరిధిలో సర్వేపల్లి కాలువ సెంటర్, కావేరినగర్‌లోని సీపీఎం కార్యాలయం తదితర ప్రాంతాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నీటిని నిల్వ ఉంచిన పాత్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలితో కూడిన జ్వరం మలేరియాకు ప్రధాన లక్షణమన్నారు. ఈ జబ్బు కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతుందన్నారు. అలాగే దోమలు కుట్టకుండా తగిన రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ సిబ్బంది శ్యాంసన్‌బాబు, రామారావు, సబ్ యూనిట్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ముమ్మరంగా యోగాంధ్ర



ఎన్‌ఎంసీలో వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న 72 ఏళ్ల రమణయ్య

నెల్లూరు(బారకాసు): యోగాంధ్రలో భాగంగా జిల్లా స్థాయిలో పెయింటింగ్, క్విజ్, యోగా షార్ట్ ఫిలిమ్, ఫొటోగ్రఫీ, యోగా పోస్టర్ డిజైన్, స్కిట్, రోల్ ప్లేయింగ్ వంటి పలు అంశాల్లో పోటీలను ఎన్‌ఎంసీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. దాదాపు 140 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. విజేతలను త్వరలో ప్రకటిస్తామని న్యాయ నిర్ణేతలు తెలిపారు. కాగా ఈ పోటీల్లో బుచ్చి మండలానికి చెందిన 72 ఏళ్ల వి.రమణయ్య యోగభ్యాస ప్రతిభ ప్రశంసనీయమని కమిషనర్ నందన్ కొనియాడారు. నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, డీఎస్డీఓ యతిరాజ్, యోగా గురువులు, న్యాయ నిర్ణేతలు స్వప్న, రాజేంద్రకుమార్, ప్రసన్నకుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నెల్లూరు సిటీ: ప్రతిఒక్కరికీ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని నారాయణ మెడికల్ గ్రూప్స్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శేషు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, సెట్నల్ సంయుక్త ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులో యోగా శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మారిన జీవనశైలికి తగినట్లు ప్రతిఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. యోగా మాస్టర్ పెంచలయ్య, జీజీహెచ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ బి.సురేంద్ర, నిర్వాహకులు బోనబోయిన ఆదిశేషు, శాఖవరపు వేణుగోపాల్, సెట్నల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ బి.నరసింహగిరి, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



బుజబుజనెల్లూరులో..

ప్రణాళికలు సిద్ధం చేయండి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్ కాలువలు, సీసీరోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ నందన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా సీసీరోడ్లు, డ్రెయిన్ కాలువల నిర్మాణ ఆవశ్యకతను ప్రజలు విన్నవించారు. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే ఇంజినీరింగ్ సివిల్ వర్క్స్ నిర్మాణాలకు అవసరమైన అన్ని ప్రణాళికలను అధికారులు సమన్వయం చేసుకుని సిద్ధం చేయాలన్నారు. స్థానిక 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ ప్రాంతంలో కమిషనర్ పర్యటించి కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు. స్థానిక వనంతోపు ప్రాంతంలో జరుగుతున్న డీసిల్టేషన్ పనులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుమతుల మేరకే భవన నిర్మాణాలు చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం వీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాలు కల్పించాలని వినతి

నెల్లూరు సిటీ: నెల్లూరు నుంచి పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు డిపో–1 మేనేజర్ మురళీకృష్ణకు విన్నవించుకున్నారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో డయల్ యువర్ డీఎం–1 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీనగర్‌కు చెందిన శర్మ పొట్టిశ్రీరాములు బస్‌స్టేషన్ నుంచి మినీబైపాస్ రోడ్డు మీదుగా సుందరయ్య కాలనీ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మూలాపేటకు చెందిన అంకయ్య నెల్లూరు నుంచి రైల్వే కోడూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. రామయ్యపాళేనికి చెందిన సాగర్ రామన్నపాళెం ఎక్స్‌రోడ్డు, కోవూరు సాయిబాబా గుడివద్ద బస్సులు ఫ్లైఓవర్ కింద నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై డిపో మేనేజర్ మురళీకృష్ణ సమాధానం ఇస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

యూరాలజీపై మెడికవర్‌లో ఆధునిక చికిత్స

నెల్లూరు(అర్బన్): మూత్రపిండాలు, మూత్రనాళాలు, మూత్రాశయం, పురుషులలో వృషణాలు, ప్రొస్టేట్ గ్రంధి వంటి అవయవాలకు చెందిన యూరాలజీ జబ్బులకు నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నామని ఆ ఆస్పత్రి యూరాలజిస్ట్ డాక్టర్ గోకుల్ నచికేత్ తెలిపారు. ఆస్పత్రిలో గురువారం యూరాలజీ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో గోకుల్‌నచికేత్ మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు ఇప్పుడు పెద్ద సమస్యగా మారిందన్నారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడితే తీవ్రమైన నొప్పి కలుగుతుందన్నారు. వీటిని మందులు, లేజర్ కిరణాలతో కరిగించడం లేదా ఆపరేషన్ చేసి తొలగిస్తామన్నారు. పురుషులలో ప్రొస్టేట్ గ్రంధి పెరగడం, ఆ గ్రంధికి కేన్సర్ సోకడం లాంటి కేసులు కూడా పెరుగుతున్నాయన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రొస్టేట్ కేన్సర్ రాకుండా అరికట్టవచ్చన్నారు. మెడికవర్‌లో లాపరోస్కోపి ద్వారా కిడ్నీకి ఆపరేషన్, ప్రొస్టేట్ తొలగింపు వంటి సంక్లిష్ట ఆపరేషన్‌లను అత్యంత కచ్చితత్వంతో, అతితక్కువ నొప్పితో రోగి వేగంగా కోలుకునేలా తమ యూరాలజీ బృందం వైద్యసేవలందిస్తోందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గాంధీ నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నీలగిరి సంఘం, బట్వాడిపాళెం సర్కిల్, రూరల్ తహసీల్దార్ కార్యాలయం, బారా షహీద్ దర్గా, బషీర్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీడీపీ విజయోత్సవం

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని, కేక్ కటింగ్ చేశారు.

దొంగలుగా చిత్రీకరిస్తే సహించం



మాట్లాడుతున్న నల్లగొండ శివ

నెల్లూరురూరల్: ఎరుకల సంఘీయులను దొంగలుగా చిత్రీకరిస్తే సహించేది లేదని ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో 800 కాలనీల్లో ఎరుకల వారు నివసిస్తున్నారన్నారు. కాగా అల్లూరు, బిట్రగుంట, కావలిలో కొన్ని ఎరుకల కాలనీలను సెటిల్మెంట్ల ఏరియా అని దొంగలుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. మాపై దుష్ప్రచారం చేస్తూ సమాజంలో వివక్షతకు గురి చేస్తున్నారన్నారు. దీనివల్ల పుట్టబోయే బిడ్డలు ప్రభావితం అవుతున్నారన్నారు. అవసరమైతే కించపరిచిన వారిపై అట్రాసిటీ కేసులు పెడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా చైర్మన్ కట్ట రామారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి బుజ్జయ్య, గౌరవాధ్యక్షుడు కట్ట రమణయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ కంప శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ్ల వెంకయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరాజు, రజిని పాల్గొన్నారు

ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలకు డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (టౌన్): నిబంధనలకు విరుద్ధంగా అనుమతుల్లేకుండా నిర్మాణంలో ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జిల్లాలో విద్యారంగ సమస్యలపై ఆయా విద్యార్థి సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, ఏపీ విద్యార్థి జేఏసీ, సింహపురి స్టూడెంట్స్ ఫెడరేషన్, ఏఐవైఎఫ్, పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పాటైంది. అనంతరం జేఏసీ నాయకులు మస్తాన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక పాఠశాలలకు గుర్తింపు లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈటెక్నో, టెక్నో ఒలింపియాడ్ తదితర పేర్లతో విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీలను విక్రయిస్తున్నారన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయా యూనియన్ నాయకులు పవన్ కిశోర్, విక్రమ్, షారూఖ్, చైతన్య, కరీముల్లా, ఆదిత్యసాయి, నరహరి, శ్రీనాథ్, మున్నా, శివవర్మ, యస్దాని, మౌళి, జాన్, నరసింహ, పండు పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వ్యక్తులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించారు. దానికి సంబంధించిన నియామక ఉత్తర్వులను గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం



నెల్లూరురూరల్: నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వంలో దేశం వికసిత భారతం వైపు పయనిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండో రోజు గురువారం సాయంత్రం స్వామివారికి నవకలశ స్నపన తిరుమంజనం, విశేష పుష్పాలంకరణ, ఆస్థాన సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రి శాత్తుమొరై, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.